www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 4 జులై 2024
5
వైఎస్ఆర్



పవన్ కుమార్‌రెడ్డికి వైవీయూ డాక్టరేట్



ప్రజాశక్తి-కడప అర్బన్ : యోగి వేమన విశ్వ విద్యాలయం తెలుగుశాఖా పరిశోధకుడు మారల పవన్ కుమార్‌రెడ్డికి విశ్వ విద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. వైవీయూ తెలుగు శాఖ ఆచార్యులు తప్పెట రామప్రసాదరెడ్డి పర్యవేక్షణలో 'ఒకదశాబ్దపు రాయలసీమనదలలు-సాంఘిక, సాంస్కృతిక జీవనం' (1981 నుండి 1990 వరకు)' అన్న అంశంపై ఈయన చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేసి నట్లు వైవీయూ పరీక్షల నిర్వహణాధికారి ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి తెలిపారు. కడప జిల్లా సింహాద్రిపురం మండలం బి.కొత్తపల్లికి చెందిన ఈయన 2019 యుజిసి జెఆర్ఎఫ్ ద్వారా పిహెచ్‌డి ప్రవేశం పొందారు. పవన్‌కు డాక్టరేట్ రావడంపై పలువురు శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు శాఖ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పరిశోధకులు పవన్‌ను అభినందనలు తెలిపారు.

వైవీయూలో డిగ్రీ కోర్సులు

- ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రఘునాథరెడ్డి



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రఘునాథరెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరం డిగ్రీ కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు విశ్వవిద్యాలయ బాధ్య రిజిస్ట్రార్, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి వెల్లడించారు. బుధవారం వైవీయూ సిపి బ్రౌన్ భాష పరిశోధన కేంద్రంలో దూర విద్యా సంచాలకులు ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి, డీన్ ప్రొఫెసర్ వై.సుబ్బరాయుడు, ప్రొఫెసర్ అమృత ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ ఎస్.వి. సుబ్బారెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జాతీయ విద్యా విధానం(ఎన్ఇపి)-2020ని ప్రతిష్టాత్మకంగా అమలు చేయడంలో భాగంగా ఈ విద్యా సంవత్సరం నుంచి బిఎస్‌సి (హానర్స్) ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్స్ కోర్సులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఈ కోర్సులు చదవడం ద్వారా భవిష్యత్తు, ఆధారిత విద్యా లభించడంతోపాటు ఎంచుకున్న రంగంలో లోతైన నైపుణ్యాన్ని గడిస్తారన్నారు. తద్వారా గ్రాడ్యుయేట్‌లను జాబ్ మార్కెట్ కు సరిపడా జ్ఞానం స్కిల్ పొంది సమాజ భవిష్యత్తు అవసరాలు తీర్చగల యొక్క పౌరులుగా తయారవుతారన్నారు. బిఎస్‌సి(ఆనర్స్) ఫిజిక్స్ సబ్జెక్టుతోపాటు కంప్యూటర్ సైన్స్, నానో-సైన్స్, కంప్యుటేషనల్ ఫిజిక్స్, డేటా సైన్స్, ఫిజిక్స్ , టెక్నాలజీ విద్యార్థి ఎంపిక చేసుకొని చదివే అవకాశం ఉందన్నారు. బిఎస్‌సి (ఆనర్స్) రసాయన శాస్త్రం మేజర్ సబ్జెక్టుగా తీసుకోవడంతోపాటు అప్లికేషన్ కెమికల్ సైన్స్, కంప్యూటేషనల్ కెమిస్ట్రీ, మెటీరియల్ సైన్స్ చదువచ్చున్నారు. బికాం (ఆనర్స్) కంప్యూటర్ సైన్స్‌ను ప్రధాన అంశంగా కలిగి ఉందన్నారు. బిజినెస్ కామర్స్ కంప్యూటర్ సైన్స్ ఫైనాన్షియల్ టెక్నాలజీ ఇనార్మేషన్ సిస్టం మేనేజ్మెంట్ వంటి అంశాలలో బలమైన పునాది వేసే అవకాశం విద్యార్థికి లభిస్తుందన్నారు. నాలుగేళ్ల హానర్స్ కోర్స్ ఉత్తమ మార్కులతో పూర్తి చేస్తే నేరుగా రీసెర్చ్‌లో ప్రవేశించే అవకాశాలు ఉందన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం 21వ శతాబ్దంలో ప్రపంచ అవసరాలకు తగ్గట్టు విద్యను అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. వినూత్నమైన కోర్సులు, అత్యాధునిక ల్యాబ్ లు, నిష్ణాతులైన, ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన పరిశోధకులు, అంకితభావం కలిగిన అధ్యాపక బృందం వైవీయూలో ఉందని చెప్పడానికి సంతోషిస్తున్నామన్నారు. నిపుణులైన పరిశోధకులు ఆహ్వానించి నిరంతరం సెమినార్లు, వర్క్ షాప్‌లు, సింపోజిఎంలు నిర్వహిస్తున్నామని తద్వారా విద్యార్థుల జ్ఞానం పెరుగుతుందన్నారు. విశాలమైన ఆట స్థలంతో పాటు, అధునాతన జిమ్ సౌకర్యం, ఆహ్లాదకరమైన వాతావరణం, విద్యార్థుల నిరంతరం చదువుకునేందుకు వేలాది పుస్తకాలు, జర్నల్స్ కలిగిన అధునాతన గ్రంథాలయం క్యాంపస్‌లో ఉందన్నారు. విద్యార్థి వైవీయూలో ప్రవేశం పొందడం ద్వారా ప్రభుత్వ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను పొందుతారన్నారు. ఆధునిక హాస్టళ్లలో సౌకర్యవంతమైన, సురక్షితమైన అభ్యాస వాతావరణాన్ని లభిస్తుందన్నారు. సెంటర్ ఆఫ్ డిస్టెన్స్ అండ్ ఆన్లైన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ దూరవిద్య కోర్సులకు మంచి ఆదరణ లభిస్తుందన్నారు. ఉద్యోగులకు, విద్యార్థులకు అదనపు డిగ్రీలు పొందేందుకు వైవీయూ దూరవిద్య అందుబాటులోకి తెచ్చిందన్నారు. 8 కోర్సులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఒకే సమయంలో ఒక రెగ్యులర్ కోర్సు, మరొకటి డిస్టెన్స్ కోర్సు చదువుకోవచ్చని రెండింటికి ఒకే విలువ ఉంటుందన్నారు.

రైలు కింద పడి ఎఎస్ఐ ఆత్మహత్య



ఎఎస్ఐ నాగార్జునరెడ్డి (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-వల్లూరు

కమలాపురం పోలీసుస్టేషన్లఓ ఎఎస్ఐగా పనిచేస్తున్న నాగార్జునరెడ్డి(58) బుధవారం తెల్లవారుజామున రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. యూనిఫాం తీసి పక్కనపెట్టి రైలు పట్టాల కిందపడి ఆయన బలవన్మరణానికి పాల్పడ్డారు. వల్లూరు మండలం తప్పెట్ల బ్రిడ్జి వద్ద రైలు పట్టాలపై ఆయన మృతదేహం లభ్యమైంది. కమలాపురం పోలీసుసేషన్‌లో ఐదేళ్లుగా ఎఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. రాత్రి విధులు ముగిశాక తెల్లవారుజామున ఇంటికి బయలుదేశారు. మార్గమధ్యలో తాడిగొట్ల సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలిని పరిశీలించారు. నాగార్జునరెడ్డిది కడప నగరంలోని మోడమిదపల్లె. ఆయన 1989లో కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరారు. ఉద్యోగోన్నతి పొంది ఎఎస్ఐగా కమలాపురంలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య లక్ష్మీ కాంతమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దకొడుకు బాబుల్‌రెడ్డికి వివాహం కాగా చిన్న కుమారుడు కార్తిక్‌రెడ్డికి వివాహం కావాల్సి ఉంది. పది సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్న నాగార్జునరెడ్డి మనస్తాపానికి గురై తన వల్ల ఎవరూ ఇబ్బంది పడకూడదని రాత్రి విధులను ముగించుకొని బుధవారం తెల్లవారుజామున వెళ్లి రైలు పట్టాలపై పడి ఆత్మహత్య చేసుకున్నాడని కడప రైల్వే ఎస్ఐ శ్రీనివారావు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించామన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని తెలిపారు.



రిజిస్టర్లను పరిశీలిస్తున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

మహిళలకు అండగా సఖి సెంటర్ : జడ్జి

ప్రజాశక్తి-కడప

ఆపదలో ఉన్న మహిళలకు ఆపన్న హస్తం వన్ స్టాప్ సెంటర్ (సఖి) అని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం జడ్జి రిమ్స్ ఆవరణలోని వన్ స్టాప్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆపదలో ఉన్న మహిళలు వన్ స్టాప్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒకే చోట అనేక సేవలు కలవన్నారు. వన్ స్టాప్ సెంటర్లో అత్యవసర స్పందన, చట్టపరమైన సలహాలు, పోలీస్ సహాయం, మానసిక సలహాలు, వీడియో కాన్ఫరెన్స్, వైద్య సహాయం, తాత్కాలిక ఆశ్రయం లాంటి సేవలు ఉంటాయని పేర్కొన్నారు. గృహహింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, యాసిడ్ దాడులు, మహిళల అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, కిడ్నాపులు, సైబర్ నేరాలు, వరకట్న వేధింపులు, వరకట్న మరణాలు వంటి సందర్భాల్లో మహిళలు సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం గురించి వివరించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ యొక్క నేషనల్ టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నెంబర్ 15100, మహిళలకు 181 ఉమెన్ హెల్ప్ లైన్, 1098 చైల్డ్ హెల్ప్ లైన్, 100 పోలీస్ హెల్ప్ లైన్ మొదలగు టోల్ ఫ్రీ నెంబర్లపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అశ్విని, సిబ్బంది పాల్గొన్నారు.

కడప ఎంఇఒగా గంగిరెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్ : కడప మండల విద్యాశాఖ అధికారి-1గా దుద్దికుంట గంగిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చెన్నూరు మండల విద్యాశాఖ అధికారి-1గా ఉంటూ కడప మండల విద్యాశాఖ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. గతంలో వివిధ మండలాల్లో మండల విద్యాశాఖ అధికారిగా పనిచేయడంతో పాటు సర్వ శిక్ష అభియాన్‌లో కూడా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప మండలంలో ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్, మున్సిపాలిటీ, అన్ని యాజమాన్యాల సమన్వయంతో మండలం ను అన్ని విభాగాల్లో ప్రతి ఒక్కరు ముందుండే విధంగా కృషి చేయాలని కోరారు.

ఎంఇఒకు ఎస్‌టియు సన్మానం : కడప నూతన ఎంఇఒ-1 ఎఫ్ఎసిగా బాధ్యతలు స్వీకరించిన గంగిరెడ్డిని ఎస్‌టియు కడప నగర శాఖ ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా నూతన ఎంఇఒ గంగిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి ముందుంటానని చెప్పారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 ఇర్షాద్ అహ్మద్, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎస్ఎండి లియోస్ బాష నగర అధ్యక్షుడు సాదిక్ అలీ, ప్రధాన కార్యదర్శి సంజీవ రాయుడు, ఆర్థిక కార్యదర్శి అస్లం, నగరపాలక స్కూల్ సూపర్వైజర్, జిల్లా నాయకులు నజీబుల్లా, ఫక్రుద్దీన్, జయరాం పాల్గొన్నారు.

నేడు వడ్డెరుల ఆత్మీయ సన్మాన సభ

ప్రజాశక్తి-కడప అర్బన్ : ఈ నెల 4వ తేదీ సాయంత్రం 4 గంటలకు స్థానిక ఐఎంఎ హాల్‌లో వడ్డెర్ల ఆత్మీయ సన్మాన సభ నిర్వహిస్తున్నట్లు వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జి.రమణయ్య, ప్రధాన కార్యదర్శ చంద్రగిరి నారాయణ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా కడప ఎమ్మెల్యే మాధవి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లాలోని వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు, కులస్తులు అందరూ హాజరుకావాలని కోరారు.



మల్లెమాల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

మల్లెమాల సేవలు ప్రశంసనీయం : 'మూల'

ప్రజాశక్తి-కడప అర్బన్ : వైద్యుడిగా, సాహితీకారుడిగా, సంఘసేవకుడిగా, ఆధ్యాత్మిక సంస్థల సంచాలకులుగా డాక్టర్ మల్లెమాల వేణుగోపాల్‌రెడ్డి సేవలు ప్రశంసనీ యమని వైవీయూ పాలక మండల సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. డాక్టర్ మల్లెమాల వేణుగోపాల్‌రెడ్డి మొదటి వర్ధంతిని పురస్కరిం చుకుని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటి ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు ఆధ్వర్యంలో బుధవారం ఆయన సంస్మరణ సభను నిర్వహిం చింది. తొలుత మల్లెమాల చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లెమాల నిరంతరం వైద్యసేవలందిస్తూనే సాహిత్యరంగాన్ని వదలకుండా అనేక రచనలు చేశారని ఎంతో మంది యువ రచయితలకు మార్గదర్శకులయ్యారని పేర్కొన్నారు. కవిగా, కథకుడిగా, నవలాకారుడిగా సుప్రసిద్ధులైన మల్లెమాల వారి ఆవలిగట్టు నవల, జ్వలనం కథాసంపుటి ప్రసిద్ధమైనవని, చచ్చేమి సాధిస్తావు మొదలైన నాటకాలు కూడా రాశారని పేర్కొన్నారు. కొండూరు జనార్ధనరాజు మాట్లాడుతూ వేణుగోపాల్‌రెడ్డి గతంలో జానమద్ది హనుమచ్ఛాస్త్రితో కలసి కడప జిల్లా రచయితల సంఘం ఆవిర్భావానికి కృషి చేశారని ఆ సంస్థకు ఎన్నో ఏళ్ళు అధ్యక్షుడిగా ఉండి ప్రసిద్ధులైన కవులను, రచయితలను కడపకు రప్పించి సాహిత్య కార్యక్రమాలు చేశారన్నారు. డాక్టర్ వెల్లాల వేంకటేశ్వరాచారి మాట్లాడుతూ సాహిత్య అకాడమీ సభ్యులుగా, అధికార భాషా సంఘం సభ్యులుగా ఆయన తెలుగు భాష, సాహిత్యాలకు సేవలందించారని తెలిపారు. కడపలో రాజీవ్ విద్యా కేంద్రాన్ని స్థాపించి ఆధ్యాత్మిక ప్రగతికి తన వంతు కృషిచేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మూల అయ్యవారురెడ్డి, డేవిడ్, విజయ్, సతీష్, గొబ్బూరి కోటేశ్వరరావు, బాబు, జ్యోతి జార్జి పాల్గొన్నారు.

కడపకు మహర్దశ ఎప్పుడో!

- కొనసాగుతూ..న్న డ్రెయినేజీ, కూడళ్లు పనులు
- లోతట్టుకు పొంచి ఉన్న ముంపు ముప్పు
- అస్తవ్యస్తంగా ప్రధాన రహదారులు
- నేడు కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం



కడప నగర పాలక సంస్థ కార్యాలయం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప కార్పొరేషన్ సమస్యలతో సతమతమవుతోంది. 2023 చివరి మాసాల నుంచి నగరంలో రూ.వేల కోట్ల వ్యయంతో డ్రెయినేజీ, కూడళ్లు, బుగ్గవంక సుందరీకరణ, బుగ్గవంకకు ఇరువైపులా రహదారి, శిల్పారామం, గాంధీ నగర్ పార్కులు సహా టిడ్కో భవనాల నిర్మాణ పనులు మొదలుకుని పలు అభివృద్ధి పనులు చేపట్టిన సం గతి తెలిసిందే. సుమారు ఏడాది సమయం కావస్తున్నప్పటికీ కడప నగరాభివృద్ధి సాకారానికి నోచుకోవడం లేదు. కడప నగర పాలక సంస్థ కమిషనర్ ప్రత్యేకదృష్టి సారించి త్వరితగతిని పూర్తి చేయాల్సిన అవసరం ఉరుముతోంది. వేసవి సీజన్ ముగిసిన నేపథ్యంలో నగరా భివృద్ధి పనుల్లో వేగం మందగించే అవకాశం కనిపిస్తోంది. దీనికితో డు ఇటీవలి సార్వత్రిక ఎన్నికల అనంతరం కొత్తగా కొలువుదీరిన రాష్ట్రప్రభుత్వం ఉన్నతాధికారుల బదిలీలను వేగవంతం చేసిన నేపథ్యం ఆందోళన కలిగిస్తోంది.

కడప కార్పొరేషన్ అభివృద్ధి మూడు అడుగులు ముందుకు ఆరు అడుగులు వెనక్కి చందంగా తయారైంది. గతేడాది సార్వత్రిక ఎన్నికలకు ఆర్నెళ్ల ముందు ప్రభుత్వం సుమారు రూ.రెండు వేల కోట్ల వ్యయంతో కడప నగరాభివృద్ధి పరుగులు తీయించే ప్రయత్నం చేసింది. రూ.వందల కోట్లతో కడప నగరంలోని ఏడు చోట్ల కూడళ్ల అభివృద్ధి పనుల్ని వేగవంతం చేసింది. అంబేద్కర్ సర్కిల్, వైజంక్షన్, కోటిరెడ్డి సర్కిల్, ఏడురోడ్ల సర్కిల్, మాసాపేట సర్కిల్ పనుల్ని పూర్తి చేసింది. పాతబస్టాండులోని పూలే సర్కిల్, ఎర్రముక్కపల్లి సర్కిల్ సహా పలు సర్కిళ్ల అభివృద్ధి ఆమడ దూరంలో నిలవడం ఆందోళన కలిగిస్తోంది. ఇదేతరహాలో ఆర్టీసీ బస్టాండు నుంచి జిల్లా న్యాయస్థానాల మీదుగా మురళీ థియేటర్ నుంచి బుగ్గవంకలోనికి వెళ్లే డ్రెయినేజీ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. మోస్తరు వర్షం కురిస్తే ఆర్టీసీ బస్టాండుకు వెళ్లే ప్రధాన రహ దారి జలమయవుతోంది. ఫలితంగా ఆర్టీసీ బస్టాండు నుంచి నగరంలోని నలుమూలలకు వెళ్లాల్సిన పాదచారులు, బైక్‌లు, ఇతర వాహనాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతుండడం తెలిసిందే. చిన్నపాటి వర్షం కురిసిన కారణంగా నగరంలోని మృత్యుంజయేశ్వర కాలనీ మొదలుకుని గౌస్‌నగర్ కాలనీ, రామకృష్ణనగర్ కాలనీ, ఇతర లోతట్టు ప్రాంతాల్లోని పలు కాలనీలు ముంపు బారిన పడుతూనే ఉన్నాయి. బుగ్గవంక సుందరీకరణ ప్రశ్నార్థకంగా మారింది. రూ.12 కోట్ల వ్యంతో కూడిన ప్రక్రియ ముందుకు సాగడం లేదు. బుగ్గవంకకు ఇరువైపులా రహదారుల నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. బుగ్గవంకకు ఇరువైపులా రహదారుల నిర్మాణంతో ప్రధాన రహదారులపై ఒత్తిడి తగ్గనుంది. ఫలితంగా ట్రాఫిక్ సులభతరం కానుంది. ఇటువంటి పనుల్ని పూర్తి చేయడంలో మీనమేషాలు లెక్కిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. కడప కార్పొరేషన్ పరిధిలోని శివారు ప్రాంతాల్లో పలు రహదారుల నిర్మాణం అస్తవ్యస్తంగా మారింది. కడప నగరం నడిబొడ్డున ఉన్న స్పెన్సర్-దిలీప్ లాడ్జి మధ్య గల రహదారి అస్తవ్యస్తంగా మారింది. స్పెన్సర్‌లో కొనుగోలుకు వందలాది మంది వినియోగదారులు రాకపోకలకు అసౌకర్యాన్ని కలిగిస్తోంది. ఇక్కడే స్కిన్ ప్లాస్టిక్ సర్జరీ హాస్పిటల్, మరో రెండు మెటర్నిటీ, కిడ్నీ డయాలసిస్ ఆసు పత్రులకు వందలాది మంది రోగులు రాకపోకలు కొనసాగుతు న్నా యి. ఆస్పత్రులకు వచ్చే రోగులు, స్పెన్సర్‌కు వచ్చే వినియోగదారులు రాకపోకలు గుంతలమయమైన రోడ్డులోని వర్షపు, మురికి నీళ్ల మధ్య ప్రయాణం సాగించాల్సి వస్తోంది. రోగాలను బాగు చేసుకోవడానికి వచ్చే రోగులు అంటువ్యాధుల బారిన పడుతుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. కడప కార్పొరేషన్ ప్రధాన సర్కిళ్లలో సిగ్నలింగ్ వ్యవస్థ పని చేయడం లేదు. ఫలితంగా పలువురు వాహనదారులు రోడ్డు ప్రమా దాల బారిన పడుతున్న దాఖలాలు ఉన్నాయి. ఇదిలాఉండగా కడప ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారంలో భాగంగా కడప నియోజకవర్గ అభివృద్ధి మేనిఫెస్టోను విడుదల చేయడం, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరిస్తాననే పేరుతో కొత్త ఆశలు కల్పించిన సంగతి తెలిసిందే.

రూ.1.91 కోట్ల విలువైన ఎర్రచందనం స్వాధీనం

- నలుగురు స్మగ్లర్లు అరెస్టు
- ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ వెల్లడి



స్వాధీనం చేసుకున్న దుంగలను పరిశీలిస్తున్న ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్

ప్రజాశక్తి-కడప అర్బన్/ఎర్రగుంట్ల

పెద్దఎత్తున తరలించేందుకు సిద్ధంగా ఉంచిన రూ.1.91 కోట్లు విలువైన 158 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ అన్నారు. బుధవారం డిపిఒలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పోట్లదుర్తి గ్రామ సమీపంలోని కొత్త కాలనీకి పోయే రోడ్డులో ఎర్రచందనం దుంగలు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన మినీ లారీ, ట్రాక్టర్, దూదేకుల బాషా ఇంటిలో దాచి ఉన్న ఎర్రచందనం దుంగలు కలుపుకుని 158 ఎర్రచందన దుంగలను నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు ఎస్‌డిపిఒ.టి.డి.యశ్వంత్ ఆధ్వర్యంలో ఎర్రగుంట్ల అర్బన్ పోలీస్ స్టేషన్ సిఐ ఈశ్వరయ్య, ఎస్ఐలు భాస్కర్‌రెడ్డి, టివిఎస్ చిరంజీవి సిబ్బందితో కలిసి నిందితులను పట్టుకున్నారని పేర్కొన్నారు. పట్టుబడిన వారిలో దూదేకుల బాష, పింజారి మహమ్మద్ రఫీ, అరవోళ్ల రఫీ, చెల్లుబోయిన శివసాయి ఉన్నారని తెలిపారు. ఎర్రగుంట్ల పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ఎర్రచందన దుంగలతో పాటు మినీ లారీ, ట్రాక్టర్, పల్సర్ మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకు న్నారని చెప్పారు. పోరుమామిళ్ల, బద్వేల్ పరిధిలోని నల్లమల్ల అటవీ ప్రాంతం నుంచి ఎర్రచందనం దుంగలు తీసుకువచ్చి పోట్లదుర్తి గ్రామంలో ఉన్న బాషా ఇంట్లో డంపు చేసి అక్కడి నుంచి చెన్నైకి తరలించే సమయంలో పోలీసులు పట్టుకున్నారని పేర్కొన్నారు. ఎర్రచందనం దుంగలు, స్వాధీనం చేసుకున్న వాహనాల విలువ కలిపి రూ.1.91 కోట్లు ఉంటుందని తెలిపారు. నిందితులను పట్టుకున్న సిఐ ఈశ్వరయ్య, ఎస్ఐలు భాస్కర్‌రెడ్డి, చిరంజీవి, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు. విలేకరుల సమావేశంలో జమ్మలమడుగు డిఎస్‌పి యశ్వంత్, ఎఆర్ అడిషనల్ ఎస్‌పి కృష్ణారెడ్డి, ఎస్‌బిఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



నాగార్జున హోటల్

కడపలో నాగార్జున హోటల్ ప్రారంభం

ప్రజాశక్తి-కడప

కడప నగరంలోని ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన నాగార్జున హోటల్‌ను బుధవారం మేనేజింగ్ డైరెక్టర్ నాగార్జున, వెంకట్ భార్గవ్, శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర ప్రజలకు రుచి, సుచితో టిఫిన్, భోజనం మా హోటల్‌లో సరసంమైన ధరలకే అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన తమ హోటల్‌ను నగర ప్రజలు అందరూ కూడా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో హోటల్ యాజమాన్య కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించాలి


ప్రజాశక్తి-కడప

విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ తెలిపారు. ఆర్‌బిఐ మార్గదర్శకాలను అనుసరించి ఇకమీదట ఫోన్ పే, గూగుల్ పే, పేటిఎం, ఇతర యుపిఐ యాప్స్‌లో మీరు విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు డిస్కౌంట్ పేరు కనిపించదని తెలిపారు. ఎపిఎస్‌పిడిసిఎల్ కన్స్యూమర్ యాప్‌ని గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని గాని లేదా మా డిస్కం వెబ్సైట్ https://www.apspdcl.in నుంచి కానీ బిల్లులు చెల్లించవచ్చని పేర్కొన్నారు. డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వాలెట్, క్యాష్ కార్డ్స్ కూడా వాడవచ్చని చెప్పారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అట్లూరు

కువైట్‌లో గుండెపోటుతో మృతి చెందిన ఈటె అయ్యావారయ్య కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని కువైట్ యాదవ సంఘం అందజేసింది. బద్వేల్ నియోజకవర్గం అట్లూరు మండల పరిధిలోని కామసముద్రం గ్రామానికి చెందిన ఆయన ఏడాది క్రితం కువైట్‌కి వెళ్ళాడు. భార్య లక్షుమ్మతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. నెల రోజుల క్రితం కువైట్లో పనిచేస్తుండగా ఒక్కసారి గుండెపోటుకు గురై అక్కడికి అక్కడే కుప్పకూలి మృతి చెందాడు. అయ్యావారయ్య కుటుంబానికి పెద్దదిక్కువగా ఉన్న కుటుంబ యజమాని మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులకు బతుకు భారమైంది. చిన్న వయసులోనే మృతి చెందడంతో తమ కుమారులను చదివించుకుండే స్తోమత లేక అయ్యావారయ్య భార్య లక్షుమ్మ సహాయం కోసం కువైట్ యాదవ సంఘాన్ని ఆశ్రయించింది. స్పందించిన కువైట్ యాదవ సంఘం అధ్యక్షులు చల్ల బాబు యాదవ్, అట్లూరు మండల కువైట్ యాదవ సంఘం అధ్యక్షులు ఆవుల పోలు మునయ్య యాదవ్ ఆ కుటుంబ ఖర్చుల కోసం రూ.లక్ష విరాళాన్ని పంపించారు. కుటుంబ ఖర్చుల కోసం బుధవారం బద్వేల్ నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షులు బుర్రి రాజా యాదవ్, అట్లూరు మండల పెద్దలు ఆవుల పోలు రమణయ్య యాదవ్, పగిడి పెద్ద ఎల్లయ్య యాదవులు అయ్యావారయ్య భార్య లక్షుమ్మకు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో కారణాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న బద్వేల్ నియోజకవర్గ యాదవ కుటుంబాలకు గత పదేళ్లుగా ఎన్నో విధాలుగా ఆదుకుంటున్న కువైట్ యాదవ సంఘానికి నియోజకవర్గ యాదవ కుటుంబ సభ్యులు ఆదుకోవడం ఎంతో శుభ పరిణామని పేర్కొన్నారు.



లక్షుమ్మకు సాయమందిస్తున్న నాయకులు

బహుభాషా కోవిదులు 'సూర్యదేవర సంజీవ్ దేవ్'



సూర్యదేవర చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో బుధవారం సూర్యదేవర సంజీవదేవ్ 110వ జయంతిని నిర్వహించారు. ముందుగా సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ తత్వవేత్త, చిత్రకారుడు, రచయిత, కవి, బహుముఖ ప్రజ్ఞాశాలిగా, బహుభాషాభిజ్ఞునిగా, లలితకళా విమర్శకునిగా ప్రఖ్యాతి పొందిన దర్శనకారుడు సూర్యదేవర సంజీవదేవ్ అని పేర్కొన్నారు. ఆయన 1914, జులై 3వన తేదీన గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం, తుమ్మపూడి గ్రామంలో జమిందారి కుటుంబంలో జన్మించారన్నారు. హిమాలయాల పట్ల ప్రేమ పెంచుకొని ఇంట్లో చెప్పకుండా 26 ఏళ్ళ వయస్సులో ఇల్లు విడిచి పెట్టి దేశ సంచారం చేశారన్నారు. హిమాలయాలల్లో ప్రకృతి చిత్రాలను వేయడం తోపాటు 30 ఏళ్ళ లోపలే హిమాలయాలతో సహా ఉత్తర భారతదేశం మొత్తం తిరిగారన్నారు. ఆయన హిందీ, బెంగాలీ, ఉర్దూ, ఫ్రెంచ్, జపానీస్ నేర్చుకున్నారన్నారు. గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు మాట్లాడుతూ సంజీవదేవ్‌కు ఎస్పరాంటో అనే కృత్రిమ అంతర్జాతీయ భాషలో కూడా ఈయనకు ప్రవేశం ఉందని, జయదేవుని గీత గోవిందంతో ప్రారంభించి కాళిదాసు రచనలన్నిటిని చదివేశారన్నారు. లక్నోలో అసిత్ కుమార్ హాల్దార్ వద్ద చిత్రలేఖనం అభ్యసించారని, లక్నోలో ఆయనకు విశ్వకవి రవీంద్రుని కలిసే భాగ్యం కలిగిందన్నారు. బెంగాలీ సాహిత్యం, చిత్రకళపై పట్టున్న సంజీవ్ దేవ్ రవీంద్రనాద్ టాగోరుతో బెంగాలీలో మాట్లాడటమే కాకుండా రవీంద్రుని రెండు బెంగాలీ కవితల్ని చదివి వినిపించారన్నారు. 'కవిగా జీవించగలిగేతేనే చాలదు. మనిషిగా జీవించగలిగితేనే కవిగా జీవించినట్టు' అన్న గురుదేవులు రవీంద్రుని మాటలను మహోపదేశంగా స్వీకరించి ఆచరణలో ఆచరించి చూపారన్నారు. సంజీవదేవ్ చిత్రకళ, ఫొటోగ్రఫీలో కూడా మంచి అభిరుచి కలవారని, ఆ రంగాలలో లోతయిన అధ్యయనం చేశారన్నారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, మౌనిక, సిబ్బంది నీలకంఠేశ్వర్, రాణి, సుమతి, అరుణ, హరికృష్ణ, పాఠకులు పాల్గొన్నారు.

బైక్‌తో సేద్యం.. సరికొత్త ప్రయోగం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

బిందు, తుంపర సేద్యం అనేవి కాకుండా బైకు సేద్యం కూడా ఉంటుందని ఓ రైతు కొత్త ప్రయోగం చేపట్టాడు. కాడెద్దులు కరువై యంత్రాల సేద్యం బరువైన నేపథ్యంలో.. ఈ బైకు సేద్యం ఇప్పుడిప్పుడే రైతులు అలవాటు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో లింగాల మండలంలో రైతు తన పంట పొలంలో బైక్‌తో సేద్యం ప్రారంభించాడు. అరటి పంటలో ఎడ్లు, ట్రాక్టర్ సేద్యం తరహాలో బైకు సాయంతో కలుపు నివారణ పనులు ప్రారంభించాడు.


బైక్‌తో కలుపు నివారణ సేద్యం చేస్తున్న రైతు

ఇలాంటి బైకు సేద్యాలు విజయవంతమైతే ప్రతి ఒక్కరూ బైకు సేద్యం వైపు మొగ్గు చూపే అవకాశం ఉందని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా వ్యవసాయం అంటేనే భారమవుతున్న ఈరోజుల్లో మొక్కవోని ఆత్మవిశ్వాసంతో బండికి పెట్రోల్ ఖర్చు కలిసొచ్చిన పర్వాలేదు అనుకుని సేద్యం సాగించడం గొప్ప విషయమని పలువురు ప్రశంసిస్తున్నారు.


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న రఘునాథ్‌రెడ్డి

స్వచ్ఛమైన తాగునీటిని అందివ్వాలి

- టిడిపి మండల పరిశీలకులు రఘునాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందివ్వాలని టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి నిర్వాహకులకు సూచించారు. స్థానిక గాంధీ రోడ్డులో ఉన్న ఎన్టీఆర్ సుజల స్రవంతి మినరల్ వాటర్ ప్లాంట్‌ను బుధవారం రఘునాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ ప్రారభించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ తక్కువ ధరకు స్వచ్ఛమైన నీటిని అందివ్వాలనే ఉద్దేశంతో ఎన్టీఆర్ పేరుమీద గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లను టిడిపి ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. లాభార్జన చూసుకోకుండా నిర్వాహకులు ప్రజలకు మంచి నీటిని అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, జయరామిరెడ్డి, గొటూరు నాగభూషణం, భాస్కర్, మహమ్మద్, వేమకుమార్, డక్కా రమేష్, జబీబుల్లా, మడక శ్రీనివాసులు, సుబ్బరాయుడు, పోతిరెడ్డి శివ, డాక్టర్ కరీముల్లా, పీరా సాహెబ్, ఫయాజ్, రజనీకాంత్‌రెడ్డి, వెల్డింగ్ బాషా, శేషారెడ్డి, బిసి సెల్ మండల కన్వీనర్ గోగుల మల్లికార్జున, తెలంగాణ వలి, అల్లాబకష్, మారుతి పాల్గొన్నారు.


హాస్టల్‌ను పరిశీలిస్తున్న తహశీల్దార్ సౌజన్యలక్ష్మి

భోజన వసతిపై తహశీల్దార్ ఆరా

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

నగర పంచాయతీ పరిధిలోని రాణివనం ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని బుధవారం తహశీల్దార్ సౌజన్య లక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పారిశుధ్యం, నీటి ట్యాంకుల శుభ్రత, తాగునీరు వంటి సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం అక్కడి విద్యార్థులతో ఆమె పలు అంశాలపై చర్చించారు. మెనూ ప్రకారం భోజన వసతిపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్, వీఆర్వోలు, హాస్టల్ వార్డెన్ పాల్గొన్నారు.


బోరును పరిశీలిస్తున్న విచారణాధికారులు

ప్రయివేట్ స్థలంలో బోరు చట్ట విరుద్ధం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ప్రయివేట్ స్థలంలో ప్రభుత్వ నిధులతో బోరు వేయడం చట్ట విరుద్ధమని డిఎల్‌పిఒ మస్తాన్ వలి తెలిపారు. చిలమకూరు పంచాయతీలో జరిగిన అవకతవలపై బుధవారం కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ప్రయివేట్ స్థలాల్లో బోరు వేస్తే సదరు యజమాని తన స్థలాన్ని పంచాయతీకి అప్పగించినట్లు రాతపూర్వకంగా ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అలా కాని పక్షంలో ప్రయివేట్ స్థలంలో బోరు ఉన్నట్లుగా తేల్చాల్సి ఉంటుందని డిఎల్‌పిఒ స్పష్టం చేశారు. ప్రయివేట్ స్థలంలోని బోరు నుంచి ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసినట్లు చూపించి, దాదాపు రూ.27 లక్షల కరెంటు బిల్లులు పంచాయతీ ఖాతా నుంచి చెల్లింపులు జరిగినట్లు తేల్చారు. ఆ మేరకు సమగ్ర నివేదిక రూపొందించి తదుపరి చర్యలు నిమిత్తం ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యవహారాలపై మరో రెండు రోజులపాటు విచారించాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి నవీన్, ఎన్‌డిఎ నాయకులు బాల అంకిరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, వేణుగోపాల్, మురళీధర్‌రెడ్డి, సత్యం, స్వామి, మహేష్ పాల్గొన్నారు.

రైతుబజార్‌ను వినియోగంలోకి తేవాలి : జెసి

ప్రజాశక్తి-రాయచోటి : పట్టణంలోని రైతుబజార్‌ను పూర్తిగా వినియోగంలోకి తేవాలని ఇందుకు వెంటనే తగిన చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం రైతుబజార్ అంశంపై జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారితో కలెక్టరేట్‌లోని తన చాంబర్లో జెసి సమీక్షించారు. ఈ సందర్భంగా రాయచోటిలోని రైతుబజార్‌లో ఖాళీగా ఉన్న షాపులను భర్తీ చేయుటకు రోడ్డు సైడ్ ఉన్న చిన్న చిన్న వ్యాపారులను ఆహ్వానించాలన్నారు. టి కొట్టు, డ్రై ఫ్రూట్స్, ఆయిల్ విక్రేతలు, టైలరింగ్, జనరల్ షాప్ తదితర వ్యాపారాలు చేసుకునే వారిని రైతు బజార్లో షాపులు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. ఆసక్తి కలిగిన చిరు వ్యాపారులు ఎవరైనా మాసాపేటలోని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కార్యాలయంలో తమ వివరాలతో దరఖాస్తు సమర్పించవచ్చునని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి టి.త్యాగరాజు పేర్కొన్నారు.

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ - రోడ్లపై వర్షపు నీరు

ప్రజాశక్తి - వేంపల్లె

మండల కేంద్రమైన వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో డ్రెయినేజీ కాలువలు అస్తవ్యస్తంగా మారిపోయాయి. దీంతో రోడ్లపైనే వర్షపు నీరు నిలిచిపోవడంతో ఆ ప్రాంత ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల నుంచి కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ జలమయం అయ్యాయి. అండర్ డ్రయినేజీ కోసం గుంతలు తీసి వదిలేయడంతో ఆయా ప్రాంతాల్లో రోడ్లపై వర్షపు నీరు నిలిచి ఇళ్ల ముందర నిలచిపోయాయి. కొద్దిపాటి వర్షానికే నీరు నిల్వ ఉండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వేంపల్లెలోని రోడ్డు భవనాల శాఖ కార్యాలయం సమీపంలోని శ్రీవాణి పాఠశాల వీధిలో డ్రెయినేజీ కాలువలు లేకపోవడంతోపాటు అండర్ డ్రయినేజీ కోసం తీసిన మట్టి రోడ్డుపైనే ఉంది. వర్షపు నీరు రోడ్డు మధ్యలోనే నిలిచిపోయిందని ఆ ప్రాంత మహిళలు వాపోతున్నారు. సమస్యను పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ఉండడంతో ప్రతి రోజూ విద్యార్థులు ఈ దారి గుండా వెళుతుంటారని, వర్షపు నీరు రోడ్డు మధ్యలో నిల్వ ఉండడంతో మురికి నీటిలోనే నడవాల్సిన పరిస్థితి నెలకొందని మహిళలు తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని కొత్త ప్రభుత్వాన్ని, అధికారులను వారు కోరుతున్నారు.


వీధిలో నిలిచిన వర్షపు నీటిని చూపిస్తున్న మహిళలు (ఫైల్‌ఫొటో)

కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న సిఐ చాంద్‌బాషా

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సిఐ చాంద్ బాషా కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోని సభా భవనంలో బుధవారం భారతీయ న్యాయ సంహిత చట్టాలపై ఐసిడిఎస్ ఆధ్వర్యంలో చక్రాయపేట, వేముల, వేంపల్లె మండలాల్లోని అంగన్వాడీలు, మహిళ పోలీసులు, సూపర్‌వైజర్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ఉన్న మహిళలకు, విద్యార్థినులకు సమాజంలో జరిగే నేరాల పట్ల అవగాహన కల్పించేందుకు వీలుగా అంగన్వాడీలు, మహిళా పోలీసులు కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కొత్త నేర చట్టాలపై గ్రామీణ ప్రజల్లో మరింత అవగాహన పెంచేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కొత్త చట్టాలు సోమవారం నుంచి అమల్లోకి వచ్చినట్లు చెప్పారు. గ్రామాల్లో జరిగే సమస్యలపై ప్రతి వారం పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. తద్వారా గ్రామాల్లో నేరాలు తగ్గే అవకాశం ఉంటుందన్నారు. ఎంపిడిఒ సంపతి దివిజా, తహశీల్దార్ నాయక్, ఐసిడిఎస్ సిడిపిఒ సునీత మాట్లాడుతూ ఐసిడిఎస్ ఎన్నో కార్యక్రమాలు చేపడు తోందన్నారు. బాల్య వివాహాలను కూడా ఆరికట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం బాలస్వామి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత పాల్గొన్నారు.

చాపాడు : భారత ప్రభుత్వం బ్రిటిష్ హయాంలో ఉన్న పాత చట్టాలను తొలగిస్తూ వాటి స్థానంలో నూతనంగా అమల్లోకి తీసుకువచ్చిన భారతీయ న్యాయ సంహిత 2023 చట్టాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఒ సావిత్రమ్మ సూచించారు. స్థానిక శ్రీశక్తి భవన్‌లో అంగన్వాడీ కార్యకర్తలకు నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన అన్ని రకాల చట్టాలపై అంగన్వాడీ కార్యకర్తలు అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయవాది మాధవీలత నూతన చట్టాలపై వివరించారు. కార్యక్రమంలో ఉపాధి ఎపిఒ జగదీశ్వర్‌రెడ్డి, వెలుగు ఎపిఎం వెంకటరమణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ శుభరత్నమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



చాపాడు : మాట్లాడుతున్న న్యాయవాది మాధవీలత

ఆర్‌టిసి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి


డిఎంకు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు విజయ్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు ఆర్‌టిసి డిపోలో పనిచేస్తున్న స్వీపర్లకు ఇస్తున్న వేతనాల్లో కోత విధిస్తున్న కాంట్రాక్టర్‌పై విచారించి, తగు చర్యలు తీసుకోవాలని సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్ డిమాండ్ చేశారు. స్థానిక డిపో మేనేజర్ ప్రవీణ్‌కుమార్‌కు బుధవారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ స్వీపర్లకు నెలకు రూ.11,200 వేతనం ఇవ్వాల్సి ఉండగా.. కేవలం రూ.9,100 ఇస్తున్నారని తెలిపారు. మళ్లీ రూ.3వేలు వెనక్కి తీసుకుంటున్నారని ఆరోపించారు. కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ సక్రమంగా కట్టడం లేదని పేర్కొన్నారు. చాలా వరకు సమస్యలను కార్మికులు చెప్పుకోలేక జీతం తీసుకుంటూ భయాందోళనలో బతుకుతున్నారని తెలిపారు. అనంతరం డిపో మేనేజర్ మాట్లాడుతూ వీటిపైన విచారించి, స్లిపర్ కార్మికులతో మాట్లాడి, వివరాలు తీసుకొని వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ ఉపాధ్యక్షుడు ఆదాము, దివాకర్ పాల్గొన్నారు.

జాతీయ రహదారి ఏర్పాటుకు కొలతలు

ప్రజాశక్తి - ముద్దనూరు

జాతీయ రహదారి నిర్మాణం కోసం రోడ్డు వెడల్పులో భాగంగా (సర్వే) కొలతలు చేపట్టినట్లు జాతీయ రహదారి ఎఇ సురేంద్రరెడ్డి తెలిపారు. ఆ మేరకు బుధవారం అధికారులు నాలుగు రోడ్ల కూడలి నుంచి రైల్వే గేటు వరకు రెవెన్యూశాఖ సిబ్బందితో రోడ్డుకు ఇరువైపులా సర్వే చేశారు. ఈ సందర్భంగా ఎఇ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా రోడ్డు వెడల్పు కోసం కొలతలు (సర్వే) తీశామన్నారు. నాలుగు రోడ్ల కూడలి నుంచి జమ్మలమడుగు రోడ్డులోని రైల్వేగేటు వరకు ఒక కిలోమీటర్ మేర రోడ్డు వేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ స్థలం నాలుగు రోడ్ల కూడలి నుంచి పాత బస్టాండ్ కూడలి వరకు 20 మీటర్లు (65 అడుగులు) ఉందన్నారు. 18 మీటర్లు వెడల్పులో రోడ్డు, డ్రయినేజీ, ఫుట్‌పాత్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. పాత బస్టాండ్ కూడలి నుంచి రైల్వే గేటు వరకు 15 మీటర్లు (49 అడుగులు) ప్రభుత్వ స్థలం ఉందన్నారు. ఇందులో ప్రభుత్వ స్థలం వరకు రోడ్డు, డ్రయినేజీ, ఫుట్‌పాత్ నిర్మిస్తామన్నారు. ప్రభుత్వ స్థలంలో ఉన్న ఆక్రమణలను తొలగిస్తామన్నారు. నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.


కొలతలు తీస్తున్న ఎన్‌హెచ్ అధికారులు, సిబ్బంది

మానవత్వం చాటుకున్న పోలీసులు

ప్రజాశక్తి - ముద్దనూరు

కన్న కూతురు ఉండి అనాథలుగా రోడ్డుపై నిస్సహాయ స్థితిలో అనారోగ్యంతో ఉన్న వృద్ధ దంపతులను పోలీసులు వృద్ధాశ్రమానికి తరలించి మానవత్వం చాటుకున్నారు. గ్రామస్తులు తెలిసిన వివరాల ప్రకారం.. పెద్ద దుద్యాల గ్రామానికి చెందిన రాచమల్లు నారపరెడ్డి, రమణమ్మ దంపతులకు కూతురు ఒక్కతే ఏకైక సంతానం. కూతురును గారాబంగా పెంచి వివాహం చేశారు. అనారోగ్యంతో భాదపడుతూ కనీసం కూర్చోలేని స్థితిలో ఉన్న తల్లి దండ్రులను ఆదరించకుండా ఛీకొట్టడంతో వృద్ధులు మానసిక వేదనతో కుంగిపోయి రోడ్డుపై పడ్డారు. మంగళవారం రాత్రి పెద్దదుద్యాలలో పికెట్ నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుళ్లు త్రివేది, ఓబులేసు, కానిస్టేబుల్ రవికుమార్ రోడ్డుపై ఉన్న వారిని గమనించి విషయాన్ని సిఐ దస్తగిరి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఆయన స్పందిస్తూ స్పందించి వెంటనే గ్రామానికి ఆటో పంపించి వారిద్దరిని ఎర్రగుంట్ల మండలం తిప్పలూరు గ్రామంలో ఉన్న అనాథా శ్రమానికి తరలించే ఏర్పాటు చేశారు. పోలీసుల చేసిన మానవసేవను ప్రజలు అభినందించారు. ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ సిఐ దస్తగిరిని, హెడ్ కాని స్టేబుళ్లు ఓబులేసు, త్రివేది, కానిస్టేబుల్ రవికుమార్‌ను అభి నందించారు.


వృద్ధ దంపతులను అనాథాశ్రమానికి తరలిస్తున్న పోలీసులు

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దాం.. పర్యావరణాన్ని రక్షించుకుందాం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేద్దాం.. పర్యావరణాన్ని రక్షించుకుందాం అని పులివెందుల మండల విద్యాధికారి రామానాయుడు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక ఇస్లాంపురం జిల్లా పరిషత్తు ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ.. ప్లాస్టిక్ సంచుల వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు. వీటిపై తల్లిదండ్రులకు, పరిసర ప్రాంతాల ప్రజలకు విద్యార్థులు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బండి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అబ్దుల్ లతీఫ్, యూనస్, మహమ్మద్ ఇక్బాల్, ప్రహ్లాద, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులతో నినాదాలు చేయిస్తున్న ఉపాధ్యాయులు

వైవీయూ పీజీ పరీక్ష వాయిదా

ప్రజాశకి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలో ఈ నెల 4వ తేదీన జరగాల్సిన పీజీ నాల్గవ సెమిస్టర్, డిగ్రీ ఏడవ సెమిస్టర్, ఇంజినీరింగ్, ఎంసిఎ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థి సంఘాలు రాష్ట్ర వ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి సూచనలతో ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు పేర్కొన్నారు. వాయిదా పడిన పరీక్షను ఆయా పరీక్షల చివరి పరీక్ష తర్వాత నిర్వహిస్తామని తెలిపారు.

నేడు రామసముద్రం మండల సమావేశం

రామసముద్రం : ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి కుసుమకుమారి ఆధ్వర్యంలో గురువారం ఉదయం మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు ఎంపిడిఒ భానుప్రసాద్ తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా పాల్గొంటారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.


బాలాజీ స్కూల్ డైరెక్టర్‌కు నోటీసు ఇస్తున్న సంఘ నాయకులు

నేటి విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి : ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరుతూ గురువారం దేశవ్యాప్తంగా తలపెట్టిన విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు నవీన్ పిలుపునిచ్చారు. ఆ మేరకు వారు బుధవారం విద్యా సంస్థల యజమాన్యాలు బంద్‌కు సహకరించాలని కోరుతూ నోటీసులిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ పరీక్ష నిర్వహణలో అక్రమాలు జరిగాయని స్వయానా కేంద్రమే ఒప్పుకుందన్నారు. అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఇందు కు భాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖా మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

మెస్ ఛార్జీల బిల్లులు చెల్లించండి మహాప్రభో..

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండల కేంద్రంలోని నాలుగు హాస్టళ్లకు సంబంధించి ఎనిమిది నెలల మెస్ ఛార్జీల బిల్లులు రాక వార్డెన్‌లు లబోది బోమంటున్నారు. ఒక్కో హాస్టల్‌కు నెలకు సగటున రూ.50 నుంచి రూ.70 వేలు ఖర్చు వస్తోంది. ఆ మొత్తాన్ని ఇన్ని నెలుగా చెల్లించలేదు. బిల్లులు ఆగిపోవడంతో కూర గాయలు, పాలు, గుడ్లు సప్లై చేసే వారు బిల్లులు ఎప్పుడు వస్తాయో అంటూ ఎదురుచూస్తున్నారు. పిల్లలకు పౌష్టి కాహారం అందించాలనే ఆలోచనలో ఉన్నప్పటికీ సరైన సమయానికి బిల్లులు అందడంలేదని వాపోతున్నారు. అరకొరగా వాడుతూ భోజనాలు పెట్టే పరిస్థితి ఏర్పడింది. అధికారులు బిల్లులు చెల్లించి, పిల్లలకు మంచి భోజనాలు అందేలా చూడాల్సిన అవసరం ఉంది.

హోరాహోరీగా సంత వేలం పాట

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె సంత మార్కెట్ వేలం పాట బుధవారం హోరాహోరీగా సాగింది. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు ఆధ్వర్యంలో కూరగాయల సంత, మార్కెట్‌లోని వాణిజ్య గదులకు వేలం పాటను అధికారులు నిర్వహించారు. 9 నెలలకే సంత మార్కెట్‌కు వేలం పాట వేయగా కుప్పాలపల్లెకు చెందిన రామగంగిరెడ్డి రూ.40 లక్షల 30 వేలకు పాట పాడి దక్కించుకున్నారు. గతంలో 12 నెలలు వేలం పాట వేయగా రు.33 లక్షలకు రామగంగిరెడ్డినే పాడారు. ఈ ఏడాది దాని కంటే ఎక్కువగా పాట పడడంతో పంచాయతీకి వేలం పాట ద్వారా ఆదాయం వచ్చినట్లు పంచాయతీ అధికారి సుబ్బారెడ్డి తెలిపారు.


వేలంపాట దక్కించుకున్న రామ గంగిరెడ్డి



మాట్లాడుతున్న వైద్యురాలు స్వాతిసాయి

తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలి

- ఎంపిడిఒ సంపతి దివిజా

ప్రజాశక్తి - వేంపల్లె

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందిస్తున్న తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపట్టాలని ఎంపిడిఒ సంపతి దివిజా సూచించారు. స్థానిక వైఎస్ఆర్ సభా భవనంలో బుధవారం తాళ్ళపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ టీమ్ సభ్యులకు సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల శుభ్రతపై ప్రజల్లో వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని కోరారు. వైద్యురాలు స్వాతి సాయి మాట్లాడుతూ అయిదేళ్లలోపు పిల్లలు ఉన్న గృహాలను ఎఎన్ఎం, ఆశా, సిహెచ్‌ఒలు గుర్తించాలన్నారు. ప్రతి ఇంటికెళ్లి అతిసార వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. మలేరియా, డెంగీ వంటి వ్యాధులపై ప్రజలు జాగ్రతగా ఉండాలని సూచించారు. తాగునీటి పైపు లీకేజీలను గుర్తించి, వాటి మరమ్మతులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఇఓపిఆర్డీ మల్లికార్జునరెడ్డి, డిఇ సాలన్న, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రమేష్‌రెడ్డి, హైల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా బేగం, సిహెచ్‌ఒలు, సచివాలయ ఇంజనీర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పింఛను పెంచడం అభినందనీయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

విభిన్న ప్రతిభావంతులకు పెన్షన్ పెంచడం అభినందనీయమని స్థానిక ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి మూగ, చెవుడు సంఘం ఆధ్వర్యంలో బుధవారం హర్షం వ్యక్తం చేస్తూ.. ప్రధానమంత్రి మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో పాలాభిషేకం చేశారు. ముఖ్య అతిథులుగా బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి.శ్రీనివాసులు, కొత్తపల్లి సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, కాంట్రాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ షాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో బధిరుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మి కిషోర్, వెంకటలక్ష్మి, ఖాదర్, బీ కేశవ, లక్ష్మి, అస్లాం మహబూబ్ బాషా, వెంకటసుబ్బయ్య, హనుమంతు, సత్యనారాయణ, మురళి, శివకుమార్ పాల్గొన్నారు.